## అధ్యాయము 31

# దేవుని సూచనల యొక్క సారాంశం

మోషే సీనాయి పర్వతం దగ్గర దేవుని కలుసుకొనుట 31వ అధ్యాయములో ముగింపులోకి వస్తుంది. బెసలేలు మరియు అహోలీయాబు అనువారు ప్రత్యక్షగుడారము యొక్క నిర్మాణ పనులను ఆదేశించును అని చెప్పుటతో (31:1-6) దేవుడు మోషేకు ధర్మశాస్త్రమును ఇచ్చే ప్రక్రియ ముగుస్తుంది. ఏమి నిర్మించాలో (31:7-11) అనేదానిని ఒకసారి సమీక్ష చేసి ఇశ్రాయేలు ప్రజలు విశ్రాంతి దినమును ఆచరించాలి అని గుర్తుచేసాడు (31:12-17). దేవుడు మోషేతో "మాటలాడుట చాలించిన" తరువాత "దేవుని వ్రేలితో వ్రాయబడిన రాతి పలకలను అతనికిచ్చెను" (31:18) అను మాటల ద్వారా దేవుని యొక్క సందేశము ముగింపునకు వచ్చినదని తెలుస్తుంది. 32వ అధ్యాయములో నమోదుచేయబడియున్న పాపము తరువాత దేవునికి ఎక్కువనే చెప్పడానికి ఉన్నప్పటికీ, తొలి బయల్పాటు మాత్రం ముగిసిందనే చెప్పవచ్చు.

### నిర్మాణకులు మరియు నిర్మాణ ప్రణాళికలు (31:1-11)

**[1]మరియు యెహోవా మోషేతో ఇట్లనెను - [2]చూడుము; నేను యూదా గోత్రములో
హూరు మనుమడును ఊరు కుమారుడునైన బెసలేలు అను పేరుగల వానిని పిలిచితిని.
[3-5]విచిత్రమైన పనులను కల్పించుటకును బంగారుతోను వెండితోను ఇత్తడితోను పని
చేయుటకును పొదుగుటకై రత్నములను సానబెట్టుటకును కఱ్ఱనుకోసి చెక్కుటకును
సమస్త విధములైన పనులను చేయుటకును జ్ఞానవిద్యా వివేకములును సమస్తమైన
పనుల నేర్పును వానికి కలుగునట్లు వానిని దేవుని ఆత్మ పూర్ణునిగా చేసియున్నాను.
[6]మరియు నేను దాను గోత్రములోని ఆహీసామాకు కుమారుడైన అహోలీయాబును
అతనికి తోడుచేసితిని. నేను నీకాజ్ఞాపించియున్నవన్నియు చేయునట్లు
జ్ఞానహృదయులందరి హృదయములలో జ్ఞానమును ఉంచియున్నాను. [7]ప్రత్యక్షపు
గుడారమును సాక్ష్యపు మందసమును దానిమీదనున్న కరుణాపీఠమును ఆ గుడారపు
ఉపకరణములన్నిటిని [8]బల్లను దాని ఉపకరణములను నిర్మలమైన దీపవృక్షమును
దాని ఉపకరణములన్నిటిని ధూపవేదికను [9]దహన బలిపీఠమును దాని
ఉపకరణములన్నిటిని గంగాళమును దాని పీటను [10]యాజకసేవ చేయునట్లు సేవా
వస్త్రములను యాజకుడైన అహరోనుయొక్క ప్రతిష్ఠిత వస్త్రములను అతని కుమారుల
వస్త్రములను [11]అభిషేక తైలమును పరిశుద్ధ స్థలముకొరకు పరిమళ ధూపద్రవ్యములను
నేను నీ కాజ్ఞాపించిన ప్రకారముగా వారు సమస్తమును చేయవలెను.**

**వచనములు 1, 2.** ప్రత్యక్షగుడారమును గూర్చిన ప్రణాళిక ఇవ్వబడియుండగా, దేవుడు ఈ నిర్మాణ పనిని నడిపించుటకు **బెసలేలు**ను ఏర్పరచుకున్నాడు. ఈయన మోషేకు సహాయకులుగా ఉన్నవారిలో ఒకరైన (17:10; 24:14) **హూరు**నకు మనుమడుగా ఉన్నట్లున్నాడు. ఆయన కూడా **యూదా గోత్రమునకు చెందినవాడే.**

**వచనములు 3-5.** బెసలేలు ఈ పనికి పూర్తిగా సన్నద్ధమైయున్నాడు ఎందుకంటే, **సమస్త విధములైన పనులను చేయుటకును జ్ఞానవిద్యా వివేకములును సమస్తమైన పనుల నేర్పును వానికి కలుగునట్లు వానిని దేవుని ఆత్మ పూర్ణునిగా చేసియున్నాడు.** మరొక మాటలో చెప్పాలంటే, ఈ పథకమునకు నిర్వహణకర్తగా ఉండుటకు బెసలేలుకు చాలా నైపుణ్యతలు ఉన్నాయి, మరియు దేవుడు వాటిని ఆయనకు దయచేశాడు గనుక వాటిని ఆయన కలిగియున్నాడు.

"పాతనిబంధన ఆరంభ దినములలో, ప్రతివిధమైన నైపుణ్యమును మరియు బలమును మరియు సమర్థతను నేరుగా మరియు నిస్సందేహంగా 'దేవుని ఆత్మ'కే ఆరోపించేవారు. దేవుడే సమస్తమైన జ్ఞానమునకు మూలముగా పరిగణించబడే వాడు గనుక ఇలా చేసేవారు" అని R. Alan Cole వ్రాసాడు.[1] "[పాతనిబంధనలో] మానవుని యొక్క ప్రతియొక్క*అపూర్వమైన* శక్తికిని మరియు కార్యములకును, అలాగే అసాధారణమైన ఆత్మీయ వరములకును" దేవుని ఆత్మనే కారణముగా చూసేవారు అని S. R. Driver సూచిస్తూ, ఇక్కడ ఈ భావము "అపూర్వమైన *కళా* సామర్థ్యత"ను సూచించేదిగా ఉన్నదని అన్నాడు.[2] "ఆత్మ"ను "బయలువెళ్లే దేవుని శక్తి"గా J. Philip Hyatt నిర్వచించాడు.[3]

బెసలేలులో ఉన్న సామర్థ్యాలు ఏవంటే ప్రశస్తమైన లోహములను (**బంగారము**, **వెండి**, మరియు **ఇత్తడి**) ఉపయోగించి విచిత్రమైన **పనులను** చేయడం, **రత్నములకు సానబెట్టడం**, మరియు **కఱ్ఱను కోసి చెక్కడం.** దేవునిచే ఆయనకు ఇవ్వబడిన అనేకమైన నైపుణ్యములకు ఈ జాబితా మచ్చుక మాత్రమే. అతని సామర్థ్య పరిమాణము **సమస్తమైన పనుల నేర్పు** అనే భావములో పునరావృతము చేయబడింది (31:3, 5).

**వచనము 6.** బెసలేలు **దాను గోత్రమునకు చెందినవాడైన అహోలీయాబు** అనువాని సహకారాన్ని పొందవలసియుంది. ఈయన తరచుగా బెసలేలుతో కూడా పేర్కొనబడ్డాడు (35:30, 34; 36:1, 2; 38:22, 23), కాని అన్ని సందర్భములలోను బెసలేలుకు **(ఆయనతో)** సహకారిగానే పేర్కొనబడ్డాడు. కాగా, దేవునిచే **నేర్పు** అనుగ్రహించబడిన ఇతర వ్యక్తులను కూడా వాక్యము పేర్కొంటుంది. బెసలేలు మరియు అహోలీయాబులు ఈ పని అంతటిని వారే చేయవలసిన అవసరం లేదు, ఎందుకంటే వారికి సహాయము చేయునిమిత్తము ఇతరులకు కూడా దేవుడు కావాల్సిన సామర్థ్యాన్ని ఇచ్చాడు. ఈ నేర్పరులకు ఏవైతే నేర్పులు ఉన్నాయో, అవన్నియు దేవుని నుండి వారు పొందియున్నారు అని వాక్యము ఉద్ఘాటిస్తుంది. "దేవుడు ఎక్కడికైతే నడిపిస్తాడో, అక్కడ ఆయన సమకూర్చుతాడు" అని ఎవరో అన్నారు. ప్రత్యక్షగుడారమును నిర్మించుటలో, ఎలా నిర్మించాలో అనే విషయములో దేవుడు మోషేను నడిపించాడు మరియు ఆ నిర్మాణ పనిని చేపట్టడానికి కార్మికులను కూడా ఇచ్చాడు.

**వచనములు 7-11.** ఆ నిర్మాణకులు ఏమేమి చేయాలో అనే సారాంశంతో

ప్రత్యక్షగుడారమును గూర్చి దేవుడు ఇచ్చిన నిర్దేశాలు ముగుస్తున్నాయి. మునుపటి ఆరు అధ్యాయములలో ఆయన నిర్మాణ నిర్దేశాలు ఇచ్చిన ప్రతీ వస్తువు ఇక్కడ పేర్కొనబడింది. దేవుడు **ఆజ్ఞాపించినవాటినన్నిటిని** నిర్మాణము చేపట్టేవారు జరిగించునట్లుగా మోషే ఈ మాటలను వారి హృదయములో ముద్రించాలనేది ఈ వాక్యభాగము యొక్క ఆలోచన. ఉద్ఘాటన కొరకు ఈ అంశము మరలా మరలా పునరావృతమైయ్యింది (31:6, 11).

| నిర్దేశాలు (అధ్యాయములు 25-30) | సారంశము (అధ్యాయము 31) |
|---|---|
| సాక్ష్యపు మందసము (25:10-16) | సాక్ష్యపు మందసము (31:7) |
| కరుణాపీఠము (25:17-22) | కరుణాపీఠము (31:7) |
| సముఖపురొట్టె బల్ల (25:23-30) | బల్ల (31:8) |
| బంగారపు దీపస్థంబము (25:31-39) | బంగారపు దీపస్థంబము (31:8) |
| ప్రత్యక్షగుడారము (26:1-30) | ప్రత్యక్ష గుడారము (31:7) |
| అడ్డ తెర (26:31-35) | --- |
| తెర (26:36, 37) | --- |
| ఇత్తడి బలిపీఠము (27:1-8) | దహనబలి కొరకు బలిపీఠము (31:9) |
| ఆవరణము (27:9-19) | --- |
| దీపము కొరకైన నూనె (27:20, 21) | --- |
| యాజకుల వస్త్రములు (28:1-43) | యాజకుల వస్త్రములు (31:10) |
| ధూపవేదిక (30:1-10) | ధూపవేదిక (31:8) |
| ఇత్తడి గంగాళము (30:17-21) | గంగాళము (31:9) |
| ప్రతిష్ఠిత నూనె (30:22-33) | ప్రతిష్ఠిత నూనె (31:11) |
| సంభారము (30:34-38) | సుగంధ సంభారము (31:11) |

## విశ్రాంతి దినమును గూర్చిన ఆజ్ఞ పునరుద్ఘాటించడం (31:12-17)

**[12-13]మరియు యెహోవా మోషేతో ఇట్లనెను - నీవు ఇశ్రాయేలీయులతో - నిజముగా మీరు నేను నియమించిన విశ్రాంతిదినములను ఆచరింపవలెను; మిమ్మును పరిశుద్ధపరచు యెహోవాను నేనే అని తెలిసికొనునట్లు అది మీ తరతరములకు నాకును మీకును గురుతగును. [14]కావున మీరు విశ్రాంతిదినము నాచరింపవలెను. నిశ్చయముగా అది మీకు పరిశుద్ధము; దానిని అపవిత్రపరచువాడు తన ప్రజలలోనుండి కొట్టివేయబడును. [15]ఆరు దినములు పనిచేయవచ్చును; ఏడవదినము యెహోవాకు ప్రతిష్ఠితమైన విశ్రాంతిదినము. ఆ విశ్రాంతిదినమున పనిచేయు ప్రతివాడును తప్పక**

**మరణశిక్ష నొందును. [16]ఇశ్రాయేలీయులు తమ తరతరములకు విశ్రాంతి దినాచారమును అనుసరించి ఆ దినము నాచరింపవలెను; అది నిత్యనిబంధన. [17]నాకును ఇశ్రాయేలీయులకును అది ఎల్లప్పుడును గురుతైయుండును; ఏలయనగా ఆరుదినములు యెహోవా భూమ్యాకాశములను సృజించి యేడవదినమున పని మాని విశ్రమించెనని చెప్పుము.**

పర్వతము మీద మోషేకు దేవుడిచ్చిన సందేశము ముగిసే ముందు, విశ్రాంతి దినమును గూర్చిన ఆజ్ఞను దేవుడు మళ్లా ఇచ్చాడు. దేవుడు మన్నాను సమకూర్చిన క్రమములో ఈ ఆజ్ఞ మునుపు ఇయ్యబడినది (16:22-30) మరియు పది ఆజ్ఞలలో భాగముగా కూడా ఇయ్యబడింది (20:8-11). నిబంధన గ్రంథముగా చెప్పబడే భాగము ముగింపులో కూడా ఇది మరలా ఇవ్వబడింది (23:12). నిర్గమకాండము పుస్తకము ముగిసే ముందు విశ్రాంతిదినమును గూర్చిన ఆజ్ఞ మరో రెండుమారులు ఇవ్వబడింది (34:21; 35:1-3).

పర్వతముమీద నుండి మోషే క్రిందికి తిరిగి వచ్చే ముందు ఆయనకియ్యబడిన ఆజ్ఞలలో విశ్రాంతి దినమును గూర్చిన ఆజ్ఞ ఎందుకు చివరిదో అనే ప్రశ్నకు ఖచ్చితంగా ఎవరూ జవాబు చెప్పలేరు, కాని రెండు సాధ్యపడు సమాధానాలు ఇవ్వచ్చు. ఈ ఆజ్ఞను పునరుద్ఘాటించడం అనేది ఈ భాగము మొత్తము యొక్క పునరుద్ఘాటన నేపథ్యానికి సరిగా సరిపోతున్నట్లుగా ఉంది. విశ్రాంతి దినమును ఆచరించడం అనేది నైతికత మరియు విలువల కంటే కూడా ఆచారములకు సంబంధించినదిగా ఉన్నది గనుక, ప్రత్యక్షగుడారము మరియు యాజకత్వమును గూర్చి మాట్లాడే వాక్యభాగములో ఈ ఆజ్ఞ బాగా సరిపోవచ్చు. John I. Durham వ్రాస్తూ,

> ఆరాధన మాధ్యమును గూర్చి ఇవ్వబడిన సూచనల పరంపరలో [విశ్రాంతి దినమును గూర్చిన సూచనలు] అనేవి ముగింపుగా ఇవ్వబడినాయి, యెహోవా ప్రసన్నత అనే వాస్తవికతను గూర్చి ఆలోచించడం మానకుండా ఉండాలనే విషయము యొక్క ప్రాధాన్యతకు ఆకర్షించులాగున ఈ ముగింపు మాటలు రూపించబడ్డాయి, అలాగే ఆరాధనలో ఆ ప్రసన్నతను నిత్యము సన్మానించుటకు సమయమును కేటాయించులాగున ఈ ముగింపు మాటలు రూపించబడ్డాయి.[4]

రెండవ సాధ్యపడు సమాధానం ఏమంటే, ఇక్కడి నేపథ్యం ప్రత్యక్షగుడారమును నిర్మించడం గనుక, విశ్రాంతి దినమున వారు పని చేయకూడదు అనే విషయాన్ని వారు జ్ఞాపకము చేయబడాలి - ఆఖరుకు అది ప్రత్యక్షగుడారపు పని అయినప్పటికీ.[5]

**వచనములు 12, 13. విశ్రాంతి దినము** అనేది **యెహోవాకు** మరియు **ఇశ్రాయేలీయులకు** మధ్య ఒక **గురుతు** (31:13, 17); దేవుడు ఇశ్రాయేలుతో చేసిన నిబంధనకు అది గురుతు. నోవహుతో చేసిన నిబంధనకు ధనుస్సు ఏ విధంగా గురుతుగా ఇవ్వబడినదో, అబ్రాహాముతో చేసిన నిబంధనకు సున్నతి అనే ఆచారం ఏ విధంగా గురుతుగా ఉందో, మోషేతో చేసిన నిబంధనకు విశ్రాంతి దినమును ఆచరించడం అనేది గురుతు. ఇశ్రాయేలీయులు విశ్రాంతి దినమును ఆచరించినంత కాలము, వారు దేవుని ప్రజలనీ దేవుడు వారిని ఐగుప్తు దేశము నుండి విడిపించాడు అనే దానికి వారు

సాక్ష్యమిస్తున్నారు (ద్వితీ. 5:12-15).

**వచనము 14. విశ్రాంతి దినమును** గూర్చిన కట్టడను మీరుట వలన వచ్చే శిక్ష **మరణము**. ఈ వాక్యభాగములో, విశ్రాంతి దినమును ఆచరించకపోవడం అనేది మరణశిక్షను ఆకర్షిస్తుందని మొట్టమొదటిసారి ధర్మశాస్త్రము బయలుపరుస్తుంది. ఈ వాస్తవము మరలా 35:2లో మరలా చెప్పబడింది మరియు సంఖ్యాకాండము 15లో కూడా ఉదాహరించబడింది. పర్యావసానాలు లేకుండా తన ధర్మశాస్త్రములోని ఏ ఒక్క కట్టడను కూడా తన ప్రజలు మీరలేరు అని వారు తెలుసుకోవాలని దేవుడు భావించాడు.

"చంపబడాలి" అనే మాటను **తన ప్రజలలో నుండి కొట్టివేయబడును** అను మాటలతో ఈ వాక్యభాగము మారిమారి వాడుతున్నట్లుగా అనిపిస్తుంది. కాబట్టి, "కొట్టివేయబడడం" అనేది స్పష్టంగా "చంపబడడము"తో సమానము. కొంతమంది పండితులు ఈ రెండు శిక్షలలో కొన్ని వ్యత్యాసాలు ఉన్నాయి అని చెప్తారు, వారి మాటల్లో "కొట్టివేయబడడం" అంటే సమాజము నుండి వెలివేయబడడం అని. ఒకవేళ నిజముగానే ఈ వ్యత్యాసము ఉన్నట్లయితే, అక్కడ అమలుచేయబడిన శిక్ష సందర్భము మీద ఆధారపడి ఉంటుంది (ఉదాహరణకు, ఆ నేరము తెలిసీ చేసినదా లేక తెలియక చేసినదా అనే దానిపై ఆధారపడి).[6]

**వచనము 15. విశ్రాంతి దినము**ను గూర్చిన కట్టడ **సంపూర్ణ విశ్రాంతి**ని కోరుతుంది. విశ్రాంతి దినము **పరిశుద్ధముగా**, ప్రతిష్ఠితదినముగా, మరియు వారములో ఇశ్రాయేలీయులు **ఏ విధమైన పనిని** కూడా చేయని దినముగా ఉండవలసి ఉంది.

**వచనములు 16, 17. విశ్రాంతి దినము** అనేది మోషే యుగమంతటిలో ఉండవలసిన విషయం: **తమ తరతరములకు విశ్రాంతి దినాచారమును అనుసరించి ఆ దినము నాచరింపవలెను; అది నిత్యనిబంధన.** "[ఇది] **నాకును ఇశ్రాయేలీయులకును అది ఎల్లప్పుడును గురుతైయుండును**" అని దేవుడు అన్నాడు. విశ్రాంతి దినము అనేది కాలము అంతము వరకు కొనసాగాల్సినది, కనుక నేటి కాలములో ఇది ఆచరింపబడాలి అని ఈ వచనములను చదువుతున్న కొందరు అనుకొనవచ్చు. కానీ, రెండు వాస్తవాలను జ్ఞాపకముంచుకోవాలి. మొదటిది, ఇశ్రాయేలుతో చేసిన నిబంధన నేపథ్యంలో మాత్రమే దేవుడు ఈ విశ్రాంతి దినమును గూర్చిన కట్టడ చేసాడు. ఒకవేళ ఈ కట్టడలు నేటికి కూడా అమలులో ఉన్నట్లయితే, అవి కేవలం ఇశ్రాయేలుకు మాత్రమే వర్తిస్తాయి. క్రీస్తు రావడం వలన, పాత నిబంధన అనేది ఎంతమాత్రమును అమలులో ఉండదు. రెండవది, పాత నిబంధనలో "నిత్యము" (עוֹלָם, *'olam*) అనే పదము "శాశ్వత కాలము" లేదా "కాలాంతము వరకు" అనే అర్థాన్ని ఇచ్చేదిగా లేదు. అహరోను యొక్క యాజకత్వము అనేది "శాశ్వత కట్టడ"గా ఇవ్వబడింది (29:9). "నిత్యమూ," "తరతరములకు," మరియు "నిత్యమైన కట్టడ" అను మాటలకు అర్థము "ఈ యుగము నిలిచియున్నంత కాలము" అని ఇటువంటి వాక్యభాగాలు స్పష్టపరుస్తున్నాయి. మోషే యొక్క యుగము ఉన్నంతకాలము, దేవుని నిబంధన జనముగా ఇశ్రాయేలీయులు విశ్రాంతి దినమును ఆచరింపవలసియున్నారు.

విశ్రాంతి దినము దేవుని అనుకరిస్తూ ఆచరింపబడాలి, **ఏలయనగా ఆరుదినములు యెహోవా భూమ్యాకాశములను సృజించి యేడవదినమున పని మాని విశ్రమించెను.**

ఏడవ దినమున దేవుడు విశ్రమించిన విధమే మొదటిలో విశ్రాంతి దినమును ఆచరించుటకు గల కారణముగా చెప్పబడింది (20:11). దేవునితో తమకున్న సంబంధమునకు "గురుతు"గా ఇక్కడ ఇశ్రాయేలీయులు "ఏడవ దినమున" విశ్రమించాలి అని ఆజ్ఞాపించబడడం మొదటి కారణముతో విబేధించుటలేదు. ఈ రెండు కూడా పరస్పరం పరిపూరకముగా ఉన్నాయే గాని విరుద్ధముగా లేవు. దేవుడే ఇశ్రాయేలు యొక్క సృష్టికర్త మరియు విమోచకుడు. ఈ రెండు కారణముల చేత - ఆయన లోకమును సృష్టించాడు గనుకను మరియు ఐగుప్తు దాస్యము నుండి వారిని విడిపించాడు గనుకను - వారు విశ్రాంతి దినమును ఆచరించాలి (31:12, 13పై గల వ్యాఖ్యలను చదవండి).

కొన్నిసార్లు పునరావృతమవుతున్నట్లుగా అనిపిస్తున్నప్పటికీ, ఈ వాక్యభాగము కావాలనే ABBA అనే కవితా నమూనాలో అమర్చబడినది:

A1: "నిజముగా మీరు నేను నియమించిన విశ్రాంతిదినములను ఆచరింపవలెను . . . మిమ్మును పరిశుద్ధపరచు యెహోవాను నేనే అని తెలిసికొనునట్లు . . . తరతరములకు . . . గురుతుగా ఉండును" (31:13).

B1: "కావున మీరు విశ్రాంతిదినము నాచరింపవలెను. నిశ్చయముగా అది మీకు పరిశుద్ధము; దానిని అపవిత్రపరచువాడు తన ప్రజలలోనుండి కొట్టివేయబడును . . . ఆ విశ్రాంతిదినమున పనిచేయు ప్రతివాడును . . . తప్పక మరణశిక్ష నొందును" (31:14).

B2: ఏడవదినము యెహోవాకు ప్రతిష్ఠితమైన విశ్రాంతిదినము; ఆ విశ్రాంతిదినమున పనిచేయు ప్రతివాడును . . . తప్పక మరణశిక్ష నొందును" (31:15).

A2: "ఇశ్రాయేలీయులు తమ తరతరములకు విశ్రాంతి దినాచారమును అనుసరించి ఆ దినము నాచరింపవలెను; అది నిత్యనిబంధన. నాకును ఇశ్రాయేలీయులకును అది ఎల్లప్పుడును గురుతైయుండును; ఏలయనగా ఆరుదినములు యెహోవా భూమ్యాకాశములను సృజించి యేడవదినమున పని మాని విశ్రమించెను" (31:16, 17).

రెండు అంతర్గత వచనములు విశ్రాంతి దినమును ఆచరింపకపోవుట వలన వచ్చే పర్యావసానాలను గూర్చి మాట్లాడుతున్నాయి. బయటకు ఉన్న వచనములు ఆజ్ఞను ఇచ్చి, అది ఎంత కాలము జరిగించాలో, ఎందుకు దానిని జరిగించాలో అనే దానికి కారణములను కూడా చెప్తున్నాయి.

## ధర్మశాస్త్రము యొక్క ముగింపు (31:18)

**18 మరియు ఆయన సీనాయి కొండమీద మోషేతో మాటలాడుట చాలించిన తరువాత**

**ఆయన తన శాసనములుగల రెండు పలకలను, అనగా దేవుని వ్రేలితో వ్రాయబడిన రాతి పలకలను అతనికిచ్చెను.**

**వచనము 18. సీనాయి కొండమీద** బయలుపరచబడిన ధర్మశాస్త్రము ఈ వచనముతో ముగిసింది. **ఆ శాసనములుగల రెండు పలకల**మీద ఉన్నదానిని **తన వ్రేలితో** దేవుడే వ్రాసాడు అనేది ఆ శాసనములలో ఉన్న విషయాలను మరింత ఆకర్షణీయంగా చేస్తుంది. దేవుని చేతనే వ్రాయబడిన శాసనములను ఆచరించకపోవుటకు మానవుడు ధైర్యం చేయకూడదు.

సుస్పష్టంగా, "రెండు పలకలమీద" వ్రాయబడినది పది ఆజ్ఞలు. ప్రత్యక్ష గుడారము మరియు యాజకవస్త్రములను గూర్చి దేవుడు ఇచ్చిన ఆజ్ఞలను బహుశ మోషే తన మదిలోనో లేక వ్రాతపూర్వకముగానో క్రిందికి తెచ్చి ఉంటాడు, బహుశ ఒక చుట్టు గ్రంథములో అయినా తెచ్చి ఉండవచ్చు. ఈ రెండవది ఎక్కువ వీలుపడే విధానం ఎందుకంటే నిబంధన గ్రంథమును మోషే మునుపు వ్రాతపూర్వకముగా నమోదు చేసాడు (24:4).

"దేవుని వ్రేలు" అనేది మానవరూపక భాష, ఎందుకంటే ఇది దేవునికి మానవ గుణమును ఆపాదిస్తుంది (15:8-10 వచనములపై గల వ్యాఖ్యలను చదవండి). "దేవుని వ్రేలితో వ్రాయబడడం" అంటే వ్రాయబడినదానికి దేవుడే మూలము అని కొంతమంది వ్యాఖ్యాతలు అభిప్రాయపడ్డారు.[7] కానీ, ఈ వాక్యభాగములో, 32:16లో మరియు 34:1లో దేవుని వ్రాతను వాక్యభాగములు ఉద్ఘాటించడం అనేది ఆ రాతి పలకలమీద "పది మాటలను" చెక్కుటకు దేవుడే స్వయంగా పాలుపొంది ఉంటాడు అని సూచిస్తుంది.[8] అధ్యాయము ముగింపులో, మోషే ఆ కొండనుండి దిగి ప్రజలకు దేవుని ఆజ్ఞలను ఇవ్వడానికి సిద్ధముగా ఉన్నాడు.

## అన్వయము

### సలేలు, వివిధమైన తలాంతులు కలిగినవాడు, యెహోవాకు ప్రతిష్ఠితుడు (31:1-5)

బెసలేలు వంటివారిని మీరు ఎన్నడైనా ఎరిగియున్నారా? ఈ వ్యక్తి దేనినైనా చేయగలిగినట్లుగా ఉన్నాడు - "విచిత్రమైన పనులను" కల్పించువాడు, రత్నములకు సానబెట్టువాడు, కఱ్ఱనుకోసి చెక్కువాడు. ఇతను "సమస్తమైన పనుల నేర్పును" కలిగిన నిపుణుడు. ఈయన మంచి నాయకుడు మరియు కార్యనిర్వాహకుడుగా కూడా ఉండి ఉండవచ్చు, ఎందుకంటే ప్రత్యక్షగుడారమును నిర్మించడానికి దేవుడు ఈయనను అధిపతిగా నియమించాడు. దేవుడు ఈ తలాంతులను ఈయనకు ఇచ్చి ఈ పని కొరకు నియమించాడు. నిర్గమకాండములోని మిగిలిన అధ్యాయములు స్పష్టపరుస్తున్నట్లుగా, బెసలేలును గూర్చిన ఒక గొప్ప విషయం ఏమంటే, ఆయన పనిని స్వీకరించాడు, పనికి తన్నుతాను అర్పించుకున్నాడు, మరియు పని పూర్తి అయ్యేవరకు నిష్క్రమించలేదు.

బహుళ - నైపుణ్యములు కలిగియున్న వారెవరైనా మీకు తెలుసా? నీవే వీరిలో ఒకడివా? నీవు వాటిని దేవుని సేవలో వాడుటకు సిద్ధముగా ఉన్నావా, దేవుడు నీకు అప్పగించే పనిని చేయడానికి నిన్ను నీవు ప్రతిష్ఠించుకొనుటకు సిద్ధముగా ఉన్నావా - అది కూడా ఆ పని పూర్తి అయ్యేవరకు నిష్క్రమించకుండా?

## విశ్రాంతి దినమును గూర్చిన విషయము ఏమిటి? (31:12-17)

మోషే ధర్మశాస్త్రములోని ఆజ్ఞలన్నిటిలో, విశ్రాంతి దినమును గూర్చిన ఆజ్ఞను మించిన వివాదాస్పదమైనది మరేది లేదు. ఇది పది ఆజ్ఞలలో ఒకటి (20:8-11; ద్వితీ. 5:12-15). దీని ప్రాముఖ్యత దేనిలో చూడగలం అంటే ఇదే ఆజ్ఞ నిర్గమకాండములో వేరే అయిదు చోట్ల ఇవ్వబడినది (16:4, 5, 22-30; 23:12; 34:21; 35:1-3). వాస్తవానికి ఇది ఎంతటి ప్రాముఖ్యం అంటే దీనిని ఉల్లంఘించడం అంటే మరణశిక్ష పొందినట్లే (31:15; 35:2; సంఖ్యా. 15:32-36). ఇశ్రాయేలు విశ్రాంతి దినమును ఆచరించాలి అనుటలో ఏ విధమైన సందేహము లేదు. క్రొత్తనిబంధన కాలములో కూడా యూదులచే ఈ విశ్రాంతి దినము ఇంకను ఆచరింపబడుతూనే ఉంది, మరియు నేడు కూడా ఇది సన్మానింపబడుతూనే ఉంది.

వివాదాస్పదమైన ప్రశ్న ఏదంటే: నేటి కాలములో మనము విశ్రాంతి దినమును ఆచరించాలా? ఒకవేళ అవసరం లేకపోతే, ధర్మశాస్త్రములో విశ్రాంతి దినమును గూర్చి ఇవ్వబడిన ఆజ్ఞకు మన జీవితములో ప్రాధాన్యత ఎలా ఉండాలి?

*నిర్బంధము కాదు.* యూదుల మీద విశ్రాంతి దినము ఏ విధముగా బంధకముగా ఉన్నదో, అదే విధముగా మన మీద కూడా బంధకముగా ఉన్నదని క్రైస్తవ్యమును ఒప్పుకొనేవారు కొందరు నమ్ముతున్నారు. వారు చెప్పేది నిజమేనా?

విశ్రాంతి దినము అనేది పాతనిబంధనలో, మోషే ధర్మశాస్త్రములో భాగము, మరియు అది నెరవేరిపోయింది. పాతనిబంధన తీసివేయబడినది అని క్రొత్తనిబంధన మనకు బోధిస్తుంది (గలతీ. 3:24, 25; ఎఫెసీ. 2:15; హెబ్రీ. 7:11-22; 8:13; 9:11-28). విశ్రాంతి దినమును ఆచరించే వారు ఏమంటారంటే తీసివేయబడిన నిబంధన పారంపర్యాచార సంబంధమైన నిబంధనలేగాని పది ఆజ్ఞలు కాదు అని. కానీ, క్రొత్తనిబంధన గానీ పాతనిబంధన గానీ చేయనటువంటి ఒక వ్యత్యాసాన్ని వారు చేస్తున్నారు. "ధర్మశాస్త్రము" అని పరిశుద్ధ గ్రంథము మాట్లాడునప్పుడు, అది ధర్మశాస్త్రము అంతటిని గూర్చి మాట్లాడుతుంది, ఆచార చట్టం మరియు నైతిక చట్టం రెండింటిని. పది ఆజ్ఞలు అనేవి ధర్మశాస్త్రములో భాగమని రోమీయులకు 7:1-7 తెలుపుతున్నాయి, మరియు క్రైస్తవులు "ధర్మశాస్త్రము విషయమై మృతులైతిరి" అని ఈ వాక్యము చెప్తుంది. "విధిరూపకమైన ఆజ్ఞలుగల ధర్మశాస్త్రము"ను క్రీస్తు కొట్టివేశాడు అని ఎఫెసీయులకు 2:15 స్పష్టపరుస్తుంది. ధర్మశాస్త్రములోని "ఆజ్ఞల"ను మరియు ధర్మశాస్త్రములోని "కట్టడల"ను ఎవరూ వేరుపరచలేరు.

కొంతమంది బోధిస్తున్నట్లుగా విశ్రాంతి దినమును గూర్చిన ఆజ్ఞ సృష్టి ఆరంభము నుండి ఉండినది కాదు. మోషే కాలమునకు మునుపు పితరులు విశ్రాంతి దినాన్ని ఆచరించినట్లు ఎక్కడా సూచన లేదు లేదా విశ్రాంతి దినము మోషే ధర్మశాస్త్రముతో

సంబంధము లేకుండా అన్ని కాలములకు ఇవ్వబడినది అని కూడా లేదు. దేవుడు ఏడవ దినమును "ఆశీర్వదించి" దానిని "పరిశుద్ధ పరచెను" అని ఆదికాండము 2:3 అన్నప్పుడు, ఆయన ఆ విధంగా *ఆ సమయములోనే చేసాడు* అని అర్థం కాదు. కానీ, విశ్రాంతి దినమును గూర్చిన ఆజ్ఞ ఇవ్వబడినప్పుడు, విశ్రాంతి దినమును ఆచరించాలి అనే ఆజ్ఞకు గల కారణము దేవుడు ఏడవ దినమున విశ్రమించాడు అనేది ఇవ్వబడినది మాత్రమే.

ఇశ్రాయేలీయులకు మరియు దేవునికి మధ్య చేయబడిన నిబంధనకు గురుతుగా విశ్రాంతిదినమును గూర్చిన ఆజ్ఞ ఇశ్రాయేలీయులకు ఇవ్వబడినది కాని అన్యజనులకు కాదు. నేడు మనము క్రొత్తనిబంధన క్రింద జీవిస్తున్నాము గనుక, ఈ ఆజ్ఞ మనకు వర్తించదు.

విశ్రాంతి దినమున ఆదిమ సంఘము ఆరాధనకు కూడుకొనవలసిన అవసరం ఉన్నట్లుగా లేదు. విశ్రాంతి దినమున క్రైస్తవ సువార్తీకులు యూదులకు సువార్త పరిచర్య చేసారు, కాని వారి ప్రకటన విశ్రాంతి దినాన క్రైస్తవ ఆరాధనలను జరిగించినట్లుగా కాదు. విశ్రాంతి దినమున కూడుకొనుటకు బదులు, క్రైస్తవులు ఆచరించిన దినము వారములో మొదటి దినము (అపో. 20:7; 1 కొరింథీ. 16:1, 2), ఇది క్రీస్తు యొక్క పునరుత్థాన దినము. ఈ దినమే "ప్రభువు దినము"గా పిలువబడింది (ప్రకటన 1:10), మరియు ఈ దినమున ప్రభువు భోజనమును ఆచరించుటకు స్థానిక సమాజములు కూడుకొనేవి. సంఘము తన ఆరాధనా కార్యక్రమములను జరిగించుటకు వారములో మొదటిదినమున కూడుకొనేవి అనే విషయం సంఘ పితరుల రచనల ద్వారా దృఢపరచబడింది. ప్రభువు దినమున విశ్రమించాలని క్రొత్తనిబంధనలో ఏ ఆజ్ఞా లేదు; ఈ కోణములో, వారములో మొదటి దినము అనేది యూదులు ఆచరించిన విశ్రాంతి దినమునకు సరిపాటిది కాదు, ఎందుకంటే విశ్రాంతి దినమున యూదులు విశ్రమించారు.

"క్రైస్తవుల విశ్రాంతి దినము" ఏడవ దినము కాదు గాని పరలోకమే. క్రైస్తవుల ప్రస్తావనలో క్రొత్తనిబంధన "విశ్రాంతి దినము" (లేదా దాని సమీప పదము)ను ప్రయోగించినది కేవలము హెబ్రీయులకు 4:9-11లోనే, అక్కడ "విశ్రాంతి దినమును" పరలోకముతో గుర్తించి దానిలోనికి ప్రవేశించాలని వాక్యము బ్రతిమాలుతుంది.

*ఓ జ్ఞాపిక.* మనము విశ్రాంతి దినమును ఆచరింపవలసిన అవసరం లేకుంటే, నేటి క్రైస్తవులకు విశ్రాంతి దినము ఎట్టి ప్రాముఖ్యతను కలిగి ఉంది? విశ్రాంతి దినమును గూర్చి ఇవ్వబడిన ఆజ్ఞ ఈ క్రింది వాటిని చేయునట్లు మనకు జ్ఞాపకము చేయాలి:

1. గురుతు. ప్రతి విశ్రాంతి దినమున ఈ లోకమును సృష్టించడానికి దేవుడు ఏమి చేసాడో ప్రతి యూదుడు జ్ఞాపకము చేయబడేవాడు. మనము కూడా దేవుడు మనకొరకు ఏమి చేసాడు, సృష్టిలో, విమోచనలో, బయల్పాటులో ఏమి చేసాడు అనేది జ్ఞాపకము చేసుకోవాలి. ఇలా గురుతు చేసుకోవడానికి ఒక విధానం ప్రభువు దినమున ప్రభువు బల్లలో పాలుపొందటానికి కూడుకోవడం.

2. విశ్రాంతి. "విశ్రాంతి దినము మనుష్యుల కొరకు నియమింపబడెను" అని యేసు చెప్పాడు (మార్కు 2:27). దీని భావము ఏమంటే వారములో ఒక దినము విశ్రమించడం మానవులకు మంచిది. ఈ ఆలోచనను మనము మననము చేసుకోవాలి;

మనము ఎదుర్కొంటున్న అతి పెద్ద సమస్యలలో ఒకటి ఏమంటే మనము చాలా ఎక్కువగా పని చేసి చాల తక్కువగా విశ్రమిస్తున్నాము.

3. ఇతరుల అవసరతలకు స్పందించడం. విశ్రాంతి దినము అనేది కేవలము ఇశ్రాయేలీయులకు మాత్రమే విశ్రమించుటకు ఒక సమయముగా ఇవ్వబడలేదు కాని వారి మీద ఆధారపడియున్న వారికి కూడా - అనగా తమ దాసులకు, తమతో నివసిస్తున్న పరదేశులకు, మరియు వారి జంతువులకు కూడా (23:12; ద్వితీ. 5:14). విశ్రాంతి దినమును గూర్చిన ఈ ఆజ్ఞ ఇతరులపై మనము కరుణ చూపించాలి అనే విషయాన్ని మనకు జ్ఞాపకము చేయును గాక.

4. పరలోకములోనికి వెళ్లుటకు, మనందరి కొరకు ఎదురుచూస్తున్న ఆ "నిత్య విశ్రాంతి"లోనికి ప్రవేశించుటకు ప్రతి ఒక్కరు పాటు పడాలి (హెబ్రీ. 4:9-11).

## విశ్రాంతి దినము: నిబంధనకు గురుతు (31:12, 13, 17)

దేవునికి మరియు ఇశ్రాయేలీయులకు మధ్య చేయబడిన నిబంధనకు విశ్రాంతి దినము "గురుతు." ఈ గురుతు ద్వారా, దేవుడు తమకు ఏమి చేసాడో అనేది ఇశ్రాయేలీయులకు నిత్యమూ జ్ఞాపకము చేయబడేది. దీనికి తోడు, ఈ విశ్రాంతి దినము మిగిలిన ప్రజల నుండి ఇశ్రాయేలును వేరు చేయుటకు ఉపయోగించబడింది; ఇశ్రాయేలు ప్రజలు విశ్రాంతి దినమును ఆచరించిన జనముగా తెలియబడ్డారు. ఈ యుగములో తన ప్రజలతో దేవుడు చేసిన నిబంధనకు ఆయన ఏదైనా "గురుతు" ఇచ్చాడా? బహుశ బాప్తిస్మమను ప్రయోగము మరియు ప్రభువు భోజనమనే ఆచరణ క్రొత్తనిబంధనకు గురుతులుగా ఉన్నాయి, ఎందుకంటే క్రీస్తు శిష్యులుగా వాటిలో పాల్గొను వారిని ఇవి గుర్తిస్తాయి. కాగా మనము క్రైస్తవులము అని చెప్పుటకు మరింత ప్రాముఖ్యమైన "గురుతు" ఏదనగా ఒకరి పట్ల ఒకరము చూపించుకొనవలసిన ప్రేమ (యోహాను 13:34, 35).

---

సూచనలు

[1]R. Alan Cole, *Exodus: An Introduction and Commentary*, Tyndale Old Testament Commentaries (Downers Grove, Ill.: Inter-Varsity Press, 1973), 210. [2]S. R. Driver, *The Book of Exodus*, The Cambridge Bible for Schools and Colleges (Cambridge: University Press, 1953), 342. [3]J. Philip Hyatt, *Exodus*, The New Century Bible Commentary (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1971), 297. [4]John I. Durham, *Exodus*, Word Biblical Commentary, vol. 3 (Waco, Tex.: Word Books, 1987), 412. [5]Umberto Cassuto, *A Commentary on the Book of Exodus*, trans. Israel Abrahams (Jerusalem: Magnes Press, 1997), 403. [6]Durham, 413. [7]Cassuto, 405-6. [8]Wilbur Fields, *Exploring Exodus,* Bible Study Textbook Series (Joplin, Mo.: College Press, 1976), 699-700. దీనికి తోడు, ఈ విశ్వము దేవుని "చేతిపని"గా కీర్తనలు 8:3 చెప్తుంది. నిర్గమకాండము 8:19లో ఈ అద్భుతము "దైవశక్తి"తో చేయబడినది అని శకునగాండ్రు ఫరోతో చెప్పారు (లూకా 11:20 కూడా చూడండి).